విశాలాంధ్ర

విజయనగరం

పేజి నెం. 8

శనివారం 4, జనవరి 2025

పోలీసులకు వ్యతిరేకంగా నినదించిన న్యాయవాదులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : అనంతపురం పోలీస్ స్టేషన్లో సివిల్ కేసు పంచాయితీకి పిలిచి, బంధించి, భయాందోళనలకు గురిచేసి సీనియర్ న్యాయవాది బి.వి.శేషాద్రి మృతికి కారణమైన యస్.ఐ., సి.ఐ.లను సస్పెండ్ చేయాలని, పోలీస్‌స్టేషన్లో సివిల్ కేసుల పంచాయతీలు అరికట్టాలని, న్యాయవాదులపై పోలీసుల దౌర్జన్యం నశించాలని శృంగవరపుకోట న్యాయవాదుల సంఘం సభ్యులు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట నినాదాలు చేసారు. మృతుని కుటుంబానికి ఐదు కోట్లు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసారు. బార్ అధ్యక్షుడు జి. నూరి దేముడు నాయకత్వంలో జరిగిన ఈ ధర్నాలో కార్యదర్శి బి. సత్యనారాయణ, కోశాధికారి బి.త్రిమూర్తులు, యన్.టి.వి.దాసు, యమ్. కామేశ్వర రావు, జి.ప్రకాశ రావు, బి.రామకృష్ణ, టి.వి.ఆర్.మూర్తి, వి.ఈశ్వరరావు, బి.రామారావు, యమ్.అనూరాధ, బి.శేఖర్ బాబు, వి.శ్రీనివాస రావు, బి.వెంకటరావు, వై.ప్రసాద్ తదితర సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 6,7,8,9 తేదీలలో శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా జరుగుతున్నాయని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు బూర వాసు ,కోట అప్పన్న అన్నారు.శుక్రవారం దాసరి నాగభూషణ్ అమర్ భవన్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వ, పాలక పక్షాలు విఫలమయ్యాయని విమర్శించారు. భారతదేశంలో యువకులు పెద్ద ఎత్తున ఉన్నప్పటికీ వారికి కల్పించవలసిన హక్కులను నిర్వీర్యం చేశారన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగినప్పటికీ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ తరుణంలో శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా జరుగుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 22వ మహాసభలలో 6వ తేదీ ర్యాలీ, బహిరంగ సభ ను జయప్రదం చేయాలన్నారు. 7,8 వ తేదీలలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే 1000 మంది ప్రతినిధులతో మూడు రోజులపాటు దేశ,రాష్ట్రంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించుకుని యువతను మమేకం చేసి భవిష్యత్తు ఉద్యమాలకు నాంది పలుకుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఎన్ గౌరీ శంకర్,. సిహెచ్ వెంకటేష్, ఎం సుధాకర్, ఎన్ మహేష్ తదితరులు పాల్గొన్నారు

సీతంలో మల్టీప్లై క్యాంపస్ డ్రైవ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం ఇంజనీరింగ్ కళాశాలలో "మల్టీప్లై సంస్థ" వారిచే క్యాంపస్ డ్రైవ్ నిర్వహించబడింది. ఈ డ్రైవ్ బి.టెక్, ఎమ్ బి.ఏ, బి.బి.ఏ విద్యార్థులు హాజరు అయ్యారు.విద్యార్థుల కు జామ్, గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూ నిర్వహించి 20 మంది విద్యార్థిని, విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. వీరికి 3 లక్షల ప్యాకేజీ తో నియామక పత్రాలు అందజేశారు . ఈ ఎంపిక ప్రక్రియను మల్టీప్లై సి. ఈ.ఓ హర్ష గుప్తా , మానవ వనరుల విభాగాధిపతి శ్వేత నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ సి.ఎస్.ఇ , ఏ. ఐ & డి.ఎస్ విద్యార్థులకు ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. అయితే అవకాశం అందుకోవడానికి వారు ఎల్లప్పుడూ తయారయి ఉండాలని విద్యార్థులకు తెలియజేసారు .మల్టీప్లై సభ్యులకు ధన్యవాదములు తెలియజేసారుకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి రామ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు మరిన్ని అవకాలను కల్పిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమాన్ని ప్లేసెమెంట్స్ ఆఫీసర్స్, వివిధ విభాగ అధిపతుల పర్యవేక్షణలో నిర్వహించారు.

ఓపెన్ కరాటేలో గురుదత్త పబ్లిక్ స్కూల్ కు పతకాలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఖరగ్ పూర్ లో జరిగిన జపాన్ కెన్యూర్యూ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్-24 లో పట్టణంలోని కొత్త అగ్రహారం లో ఉన్న గురుదత్త పబ్లిక్ స్కూల్ కు చెందిన విద్యార్థులకు పతకాలు లభించాయి. ఈ మేరకు కరాటే కోచ్ కె.సంతోష్ కుమార్ శుక్ర వారం విడుదల చేసిన ప్రకటనలో విద్యార్థులు పి.హేమంత్ (రెండు బంగారు), కె.శివగణేష్ (ఒక బంగారు, ఒక కాంస్య పతకం), బి.రేశ్వంత్ (కాంస్య) పతకాలతో విజయ భేరీ మ్రోగించారు. కోచ్ సంతోష్‌కుమార్ తోపాటు విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ పద్మ, శంకరరావు తదితరులు అభినందించారు. మరిన్ని విజయాలు సాధించి పాఠశాల కు, తల్లిదండ్రుల కు మంచి పేరు తీసుకు రావాలని కోరారు.

అవ్వతాతలకు చీరలు పండ్లు వితరణ

విశాలాంధ్ర-మెరకముడిదాం: మెరక ముడిదాం మండలం బిల్లలవలస గ్రామంలో యువనాయకులు చీపురుపల్లి సుజుకి షోరూం ప్రొప్రైటర్ కె.సత్యనారాయణ బిల్లలవలస ఎస్సీ కాలనీలో ఉన్నా అవ్వ తాతలకు, వితంతువులకు,నూతన సంవ త్సర సందర్భంగా దుప్పట్లు, చీరలు, పండ్లు అందించారు. ఆయన సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అవ్వ తాతలకు చీరలు, పండ్లు అందజేస్తామని సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పొలాలను పరిశీలించిన జెడి

విశాలాంధ్ర-జామి: మండలంలోని భీమసింగిలో ఇటీవల వచ్చిన తుఫానుకు నష్టపోయిన మొక్కజొన్న పంట పొలాలను జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన చేసారు. వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.విజయతోపాటు మండల వ్యవసాయధికారి పి. కిరణ్‌కుమార్ లతో కలిసి ఆయన పొలాలను పరిశీలించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటపొలాలలో ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయా పొలాల రైతులకు వివరించారు. ప్రధానంగా మొక్కజొన్నకి యూరియా, పొటాష్‌లను ఇప్పుడే వేసుకోవాలని, క్లోరోఫైపోస్, ప్రొఫెక్సోకోనాజలను కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే అపరాల పంటలకు పూతకు ముందు 19-19-19 ఎరువులు పిచికారితోపాటు సాఫ్‌క్లోరో ఫైపోస్250 ఎంఎల్ పిచికారీ చేయాలన్నారు. అలాగే పిందె దశలో 13-0-45 ఎరువును ఒక కేజీ ఒక ఎకరానికి వేసుకుంటే కాయ పెద్ద సైజులో ఉండి రాలిపోకుండా ఉంటుందని వివరించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది భార్గవి, శివతోపాటు స్థానిక గ్రామ పెద్దలు మజ్జి హరికృష్ణ, జొన్నాడ వాసు, మజ్జి మోహనరావు, ఆల్తి సూరిబాబు, కోరాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

సారిపల్లి టిడ్కో కాలనీలో వీధిదీపాల ఏర్పాటు

విశాలాంధ్ర-విజయనగరం: పట్టణంలోని సారిపల్లి టిడ్కో కాలనీలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ డా. బిఆర్ అంబేద్కర్, ఎంఎల్ఏ పూసపాటి అదితీ గజపతిరాజు గురువారం టిడ్కో కాలనీలను పరిశీలించిన విషయం తెలిసిందే. వీరి పర్యటనలో కాలనీ వాసుల కష్టాలను తెలుసుకున్నారు. ప్రధానంగా కాలనీవాసులు వీధిదీపాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు నెల్లిమర్ల మున్సిపల్ అధికారులు మరునాడే వీధి దీపాలను ఏర్పాటు చేశారు.

టెక్ ఉత్సవ్ 2కె25 రావాడ విద్యార్థుల ప్రాజెక్ట్ కు మొదటి బహుమతి

విశాలాంధ్ర-భోగాపురం: అవంతి పాలిటెక్నికల్ కళాశాలలో నిర్వహించిన టెక్ ఉత్సవ్ 2కె 25 కనెక్టింగ్ విత్ ఫ్యూచర్ సదస్సులో రావడ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తయారుచేసిన "ఎర్త్‌క్వేక్ సెన్సార్" ప్రాజెక్ట్ కు మొదటి బహుమతి లభించింది. రావడ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు జ్యోతి, శరత్ కుమార్ పర్యవేక్షణలో 8 వ తరగతి చదువుతున్న సి. హెచ్ గణేష్, జె.గౌతమ్ ఎర్త్‌క్వేక్ సెన్సార్" తయారుచేసి ప్రదర్శించారు. దీనికి మొదటి బహుమతి లభించిందని రావాడ ప్రధానోపాధ్యాయుడు ఎం.సూర్యనారాయణ తెలిపారు.దీనిపై పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సోనియానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : రాష్ట్రంలో రహదారులు, త్రాగునీరు, విద్యుత్ మొదలగు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మౌలిక సదుపాయాల విషయంలో ఈ ఆరునెలల పాలనలో అద్భుత ఫలితాలను సాధించామని చెప్పారు. అభివృద్ధితోపాటు సంక్షేమానికి కూడా ప్రాధాన్యతనిస్తూ ముందుకు వెళ్తున్నామని అన్నారు. స్థానిక సోనియానగర్‌లో సుమారు రూ.5.19 కోట్ల ఖర్చుతో నిర్మించిన 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం మంత్రి కొండపల్లి ప్రారంభించారుఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, అభివృద్ధికి విద్యుత్ అత్యంత కీలకమని పేర్కొన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో సుమారు 7000 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు ముఖ్యమంత్రి చంద్రాబాబు ఒప్పందం చేసుకుంటే, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని రద్దుచేసి, రాష్ట్రాన్ని విద్యుత్ లోటులోకి నెట్టిందని చెప్పారు. దీనివల్లే గత రెండేళ్లు విపరీతంగా విద్యుత్ కోతలు పెరిగిపోయాయన్నారు. ఆర్ఈసి నుంచి రుణం తీసుకొని విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసే అవకాశం ఉన్నా, అప్పటి ప్రభుత్వం దృష్టిపెట్టకుండా పూర్తిగా నిర్వీర్యం చేసిందని చెప్పారు. గత ప్రభుత్వ నిర్వాకాలవల్ల వినియోగదారులపై భారాలు పడ్డాయని, విద్యుత్ బిల్లులు పెరిగిపోయాయన్నారు. పరిశ్రమలపైనా విద్యుత్ భారం విపరీతంగా పెరిగిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తోందని చెప్పారు. ఈ ఆరునెలల్లోనే కొత్తగా ఎంఓయు చేసుకోవడమే కాకుండా గ్రీన్ పవర్, సోలార్ పవర్‌పై దృష్టి సారించినట్లు తెలిపారు. అంతేకాకుండా విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని చేపట్టామన్నారు. కేవలం విద్యుత్ రంగంలోనే కాకుండా రహదారులు నిర్మిస్తున్నామని, త్రాగునీటి సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. పోలవరం శరవేగంగా నిర్మాణం జరుగుతోందని, సుమారు రూ.80వేల కోట్ల ఖర్చుతో పెన్నా నీటిని రాయలసీమకు తరలించేందుకు ప్రతిపాదనలు చేస్తున్నారని మంత్రి తెలిపారు. విజయనగరం ఎంఎల్ఏ పూసపాటి అదితీ విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ, సోనియానగర్‌లో నిర్మించిన ఈ సబ్‌స్టేషన్ వల్ల టిడ్కో కాలనీతోపాటు, వైఎస్ఆర్‌నగర్, గాజులరేగ తదితర ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. గత టిడిపి ప్రభుత్వ హయంలో వేణుగోపాలపురం వద్ద 220 కెవి సబ్‌స్టేషన్ మంజూరయ్యిందని, ఆ తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రక్కన పడేసిందని చెప్పారు. సుమారు రూ.200 కోట్లు ఖర్చు అయ్యే ఈ సబ్‌స్టేషన్‌కు ఇటీవలే తమ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని చెప్పారు. ఇది పూర్తయితే విజయనగరం, గజపతినగరం నియోజకవర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని, భోగాపురం విమానాశ్రయానికి బ్యాకప్‌గా పనిచేయడమే కాకుండా జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ప్రయోజం చేకూరుతుందని చెప్పారు. రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి, ఎపిఈపిడిసిఎల్ సూపరింటిండెంట్ ఇంజనీర్ ఎం.లక్ష్మణరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఈఈలు పి.త్రినాధరావు, పి.హరి, ఎడిఈలు, డిఈలు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫాం గెల ధర టన్నుకు రూ.20.290

జిల్లా ఉద్యానశాఖ అధికారి లక్ష్మీనారాయణ వెల్లడి

విశాలాంధ్ర-విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఆయిల్ ఫాం టన్ను గెల ధర రూ.20,290 లుగా నిర్ణయించిందని జిల్లా ఉద్యానశాఖ అధికారి పిఎన్‌వి. లక్ష్మీనారాయణ తెలిపారు. ఇందుకు సంభందించిన ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఉన్న ఆయిల్ ఫాం కంపెనీలు సరఫరా చేసిన ఆయిల్ ఫాం రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన సమాయానికే ధరలను చెల్లించాలని కంపెనీల యాజమాన్యాలను కోరారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలన్నారు. నీటి సదుపాయం ఉన్న రైతులు ఆయిల్ ఫాం సాగుకు ఆసక్తి చూపాలని ఆయిల్‌ఫాం మొక్కలకు శతశాతం రాయితీ ప్రభుత్వం ఇస్తోందన్నారు. పంట నిర్వహణకు హెక్టారుకు రూ.5,250చొప్పున రాయితీని మొదటి నాలుగు ఏళ్ళపాటు రైతులకు అందజేస్తామన్నారు. వివరాలకు స్థానికంగా ఉన్న ఉద్యాన శాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.4,47,668 లు

విశాలాంధ్ర-చీపురుపల్లి : విజయనగరం జిల్లా,చీపురుపల్లి మండలం మరియు గ్రామం నందు వేంచేసియున్న శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం హుండీలను లెక్కించగా 4,47,668 రూపాయలు ఆదాయం వచ్చినట్లు తనిఖీదారు ఈ శ్యాంప్రసాద్ ఉదయం దేవదాయ ధర్మాదాయశాఖ, విజయనగరం తనకి దారి శ్యాం ప్రసాద్ సమక్షంలో దేవాలయం వద్ద తెరచి లెక్కించగా తే 09.09.2024 ది నుండి 03.01.2025 ది వరకు రూ. 4,47,668/లు వచ్చినది. కార్యక్రమంలో గోవింద్‌నాయుడు, కానిస్టేబుల్ ,చీపురుపల్లి మరియు గ్రామ పెద్దలు ఫాల్గొన్నారు.

మహిళా హక్కుల ఉద్యమ కెరటం సావిత్రిబాయి పూలే

జనసేన నాయకులు గురాన అయ్యలు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: మహిళల విద్యను ప్రోత్సహించి అందుకోసం చారిత్రక పోరాటం నడిపిన ధీశాలి సావిత్రిబాయి పూలే అని జనసేన నేత గురాన అయ్యలు కొనియాడారు. సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టర్ ఆఫీస్ జంక్షన్ వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఉపాధ్యాయురాలు మాత్రమే కాదని.. ఆమె రచయిత్రి, కవయిత్రి, సామాజిక కార్యకర్తగా కుల, మత, లింగ బేధాలు లేకుండా సమాజంలోని మహిళలు, బడుగు బలహీన వర్గాల బాగు కోసం శక్తివంచన లేకుండా ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన సైనికులు ఎంటి రాజేష్ , ఎం.పవన్ కుమార్ ,అడబాల వేంకటేష్ నాయుడు , పృథ్వీ భార్గవ్, జి. శ్రీనివాసరావు , కంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణం సంగవీధిలో అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షుడు సోరు సాంబయ్య ఆధ్వర్యం లో మాత సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్ఫూర్తి మహిళ మండలి డైరెక్టర్, ఏఐటీయూసీ జిల్లా నాయకురాలు బలగరాధ హాజరయ్యారు. ముందుగా బలగ రాధా చేతుల మీదుగా సావిత్రిబాయి చిత్రపటాన్ని పూలమా లలతో ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నిరుపేద దళిత మహిళలకు చీరలు పంపిణీ బలగరాద చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మహిళల అభ్యున్నతికి, గిరిజన మహిళలు, దళిత మహిళల చైతన్యం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్న బలగరాధకు మహిళలంతా ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షుడు సోరు సాంబయ్య, ఏఐటీయూసీ నాయకులు రాలు బలగరాధ లు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జయంతి జరుపుకోవడం మనమంతా అదృష్టంగా భావించాలని అన్నారు. కార్యక్రమంలో ఏ గోపాల్ రావు వయ్యా ఆనంద్ రావు కే మహేష్ పట్నాయక్ ఎన్ఎస్ గుప్తా ఎన్ఎస్ గుప్తా కేటీ ఆచారి కోటా రవి వీ తవుడు ఎన్ ఈశ్వరరావు బి భాస్కరరావు జె దుర్గారావు జి వెంకట్రావు మరియు మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వర రావు

విశాలాంధ్ర-వేపాడ: మండల కేంద్రమైన వేపాడ శివారు బక్కు నాయుడుపేటలో గల ఆదర్శ పాఠశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయురాలు దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు తెలిపారు. శుక్రవారం మొదటి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని పురస్కరించుకొని సావిత్రిబాయిపూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వర రావు, ఉపాధ్యాయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాఠశాలలో విధులు నిర్వహిస్తూ తక్కువగా సెలవులు ఉపయోగించుకున్న మహిళా ఉపాధ్యాయినులు జి.విజయ,జి.కళ్యాణిలను దుస్సాలువతో ప్రధానోపాధ్యాయులు సత్కరించారు. అలాగే మహిళా ఉపాధ్యాయ సిబ్బందితో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

భీమాలిలో ఇంటింటి కొళాయి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

విశాలాంధ్ర-లక్కవరపుకోట: మండలం లోని భీమాలి గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం క్రింద ఇంటింటికి కొళాయి పనులకు ఎస్ కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి చేతులు మీదుగా శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద 50.60 లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కూటమి ప్రభుత్వము అధికారంలోకి రావడానికి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం తనను ఆదరించి బీమాలి గ్రామము మంచి మద్దతు ఇచ్చి అత్యధిక మెజార్టీని చూపించారని గ్రామానికి రుణపడి ఉంటానని అన్నారు. అలాగే తాటిపూడి నుంచి పైలెట్ ప్రాజెక్టు కింద 90 కోట్ల రూపాయలు నియోజకవర్గానికి ఏ విధంగా కృషి చేస్తున్నాను అని అన్నారు. గ్రామంలో 5 40 గృహాలు ఉన్నాయని ప్రతి ఇంటికి కొళాయి ఆదుకుంటామని 4.49 లక్షల రూపాయలు నిధులు డ్రైనేజీ కాలువలు పనులకు శంకుస్థాపన చేశారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సన్యాసిరావు మాట్లాడుతూ తాటిపూడి నీరు వచ్చే విధంగా ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి చేసిన కృషిని మరువలేమని అన్నారు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొయ్యన కృష్ణ, మాజీ సర్పంచ్ గుల్లేపల్లి రామనాయుడు, ముదునూరు శ్రీనుబాబు, సచివాలయ సిబ్బంది, ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురమ్మవలస వద్ద ఆర్టీసీ బస్సు బోల్తా

సురక్షితంగా ప్రయాణికులు

విశాలాంధ్ర-మెంటాడ : మెంటాడ మండలం గురమ్మవలస గ్రామ సమీపంలో శుక్రవారం ఆర్టీసీ బస్సు బోల్తా పడింది.ఆంధ్రపోలీసులు అందించిన వివరాల ప్రకారం విజయనగరం నుంచి జక్కువ వెళుతున్న ఆర్టీసీ బస్సు మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది.బస్సులో ఆరుగురు ప్రయాణికులు మాత్రమే వున్నారు.ఈఘటనలో ప్రయాణీకులకు, డ్రైవర్,కండక్టర్ కు ఎటువంటి ప్రమాదం వాటిల్లికపోవడం ఊపిరి పీల్చుకున్నారు.స్వల్ప గాయాలైన వారిని గజపతినగరం ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై ఆంధ్ర ఎస్ఐ కె సీతారాం కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాత బొబ్బిలి లో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి సందర్శన

విశాలాంధ్ర-బొబ్బిలి: పారిశుధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి ఆదేశించారు . శుక్రవారం పట్టణం పాత బొబ్బిలి లో మున్సిపల్ కమిషనర్ లాలం క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, శానిటరీ ఇన్స్పెక్టర్, పర్యావరణ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ మెస్త్రీలు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ మరియు వార్డు ఎమినిటీ సెక్రటరీలతో పాత బొబ్బిలి సచివాలయ పరిధిలో గల పల్లి వీధి, పళ్ళెం వీధి, కూరాకుల వీధి మరియు దిబ్బ వీధి ఏరియాలలో పర్యటించారు.పల్లెం వీధిలో కాలువలలో సిల్టు తొలగించాలని ఆదేశించారు, పల్లి వీధి రామ మందిరం వద్ద తొలగించిన సిల్టును జె.సి.బి. తో లిఫ్ట్ చేయించాలని ఆదేశించారు, కూరాకుల వీధిలో కాలువలను శుభ్రపరచాలని అలాగే ప్రతిరోజు శానిటేషన్ నిర్వహించాలని ఆదేశించారు, కుళాయి నుండి వస్తున్న నీటికి క్లోరినేషన్ టెస్టులు నిర్వహించి పి.హెచ్. లెవెల్ లను పరిశీలించారు, తదుపరి నిర్మాణ దశలో ఉన్న సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలరు సి. హెచ్. రమేష్ నాయుడు 2వ వార్డు కౌన్సిలర్ కోట పెదరాములు మరియు వార్డు ఇన్చార్జిలు పాల్గొన్నారు.

కళ్ళు లేని జీవితం అంధకారమయం

విశాలాంధ్ర-చీపురుపల్లి : కళ్ళు లేని జీవితం అంధకారమయమని, కంటి చికిత్సల విష యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని చీపురుపల్లి మానవీతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బివి గోవిందరాజులు అన్నారు. శుక్రవారం నాడు చీపురుపల్లి మండలంలోని రావివలస గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లికళ్ళు లేని జీవితం సర్వం అంధకారమయం. అందుకే అంటారు " సర్వేంద్రియానం నయనం ప్రధానం అని అన్నారు లిఅదే ప్రధాన ధేయంతో మ మానవీయత సంస్థ ఆధ్వర్యంలో ఇటువంటి శిబిరాలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఓ ఈ యు లైన్స్ కంటి ఆసుపత్రి చీపురుపల్లి వారి సహకారం సహకారంతో గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా 63 మంది వైద్య శిబిరంలో కళ్ళ పరీక్షలు నిర్వహించుకున్నారు. వీరిలో కంటి ఆపరేషన్లుకు 28 ఎంపిక కాగా వారికి సత్ర చికిత్సలు నిర్వహించుటకు సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయనున్నామన్నారు.. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పనస మణికంఠ, వైస్ సర్పంచ్ రేగిడి అన్నమ్నాయుడు, అప్పలనాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అందరి సమిష్టి కృషితో నగరాభివృద్ధి సాధ్యం

నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విశాలాంధ్ర -విజయనగరం అర్బన్: అందరి సమిష్టి కృషితో నగరాభివృద్ధికి చొరవ చూపుతున్నామని విజయనగరం నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. అజెండాలో పొందుపరిచిన 8 అంశాలపై చర్చ అనంతరం వాటిని సభ్యులు ఆమోదించారు. వివిధ అంశాలపై పలువురు కార్పొరేటర్లు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించడం పట్ల పలువురు కార్పొరేటర్లు హర్షం వ్యక్తం చేశారు. భవన నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో నిధులు కేటాయించి నిర్మాణాన్ని పూర్తి చేసే అంశమై అధికారులు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అందరి ఆమోదంతో అంబేద్కర్ భవన నిర్మాణానికి మార్గం సుగమమయింది. పలు అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు. సమావేశం అనంతరం మేయర్ విజయలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ అందరి సమిష్టి కృషి ఫలితంగా నగరాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఆర్థిక వనరులను పెంపొందించుకొని తద్వారా ప్రజలకు సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. ఇందుకు కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది మరింతగా శ్రమించాలని అన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య,డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి,ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మా గిరిజన గ్రామ శ్మశానవాటిక స్థల వివాదం పరిష్కరించండి ...

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యస్ సోమేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హాజర య్యారు మండల అధికారులు.ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.మండలంలో పలు సమస్యలు కరెంటు.రెవెన్యూ . ఉపాదహామీ. వైద్యం. తదితర ముఖ్య శాఖ అధికారులతో సమస్యలపై సమావేశం నిర్వహించారు.పుణ్యగిరి ఎంపీటీసీ ఆర్ ధారగిరి మాట్లాడుతూ మా గిరిజన గ్రామ శ్మశాన వాటిక స్తల వివాదం పరిష్కరించండి. ఇదే విషయం గతం లో అధికారులకు తెలియపరచినప్పటికీ ఇటువంటి స్పందన లేదని ఎన్నో ఏళ్లగా ఉన్న స్మశా న వాటిక రోడ్డు వేరే వ్యక్తి కబ్జా చేసి మీకు ఇలా రోడ్డు లేదు అని అడ్డుపడటంతో స్మశాన వాటికకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నా ం అని ఎమ్మార్వో దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మార్వో దీనిపై విచారణ జరిపి మీకు న్యాయంచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్, వైస్ ఎంపీపీ సుధారాణి. ఎమ్మార్వో అరుణ్ కుమారి. మండల అధికారులు, సర్పంచులు. ఎంపీటీసీలు . తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి మెడికల్ పెన్షన్ల రీ-వెరిఫికేషన్

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: ఈ నెల 6వ తేదీ నుంచి మెడికల్ పెన్షన్ల రీ-వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ ప్రక్రియపై జిల్లా అధికారులు, ఎంపిడిఓలు, వైద్యాధికారులతో శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ తమ ఛాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వైద్య పింఛన్లలో పూర్తిగా మంచానికే పరిమితమై పింఛన్ పొందుతున్నవారు 342 మంది ఉన్నారని, తొలివిడతలో వీరి పింఛన్లను రీ వెరిఫికేషన్ చేయడం జరుగుతుందని చెప్పారు. తరువాత దశలో మిగిలిన వైద్య పింఛన్లను పరిశీలిస్తారని చెప్పారు. రీ వెరిఫికేషన్‌కు ఇతర జిల్లాలనుంచి 6 బృందాలు వస్తాయని చెప్పారు. ఒక్కో బృందంలో ఒక ఆర్థోపెడిక్ డాక్టర్, ఒక జనరల్ మెడిసన్ స్పెషలిస్ట్, వైద్యాధికారితోపాటు ఒక డిజిటల్ అసిస్టెంట్ ఉంటారని తెలిపారు. వీరంతా ఆయా రోగులను, వారి మెడికల్ సర్టిఫికేట్, సదరం, ఆధార్ తదితర ధృవపత్రాలను పరిశీలన చేసి, వారి వివరాలను యాప్‌లో నమోదు చేస్తారని చెప్పారు. వరుసగా మూడు రోజుల పాటు ఈ బృందాలు పర్యటిస్తాయని, మూడు రోజుల విరామం తీసుకుంటాయని చెప్పారు. వీరి తనిఖీలకు వీలుగా షెడ్యూల్‌ను రూపొందించాలని ఆదేశించారు. సంక్రాంతి పండుగకు ముందే వీలైనంత ఎక్కువమందిని తనిఖీ చేసేటట్లుగా చూడాలని సూచించారు. పింఛన్‌దారుల అర్హతలను, ధృవపత్రాలను పరిశీలించడానికి మాత్రమే ప్రభుత్వం ఈ ప్రక్రియను చేపడుతోందని, అర్హుల పింఛన్లు తొలగించే ఉద్దేశ్యం ఎంతమాత్రం ప్రభుత్వానికి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి డిఆర్‌డిఓ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, జెడ్‌పి సిఈఓ బివి సత్యనారాయణ, ఇపిఓ టి.వెంకటేశ్వరరావు, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, జిజిహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, డిటిసి డాక్టర్ కె.రాణి, ఆర్‌బిఎస్‌కె డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిరిపురంలో సావిత్రిబాయి పూలే జయంతి

విశాలాంధ్ర.సంతకవిటి/రాజాం: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సిరిపురంలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాల్లో భాగంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి విద్యార్థులు,ఉపాధ్యాయులు ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే దేశానికే ఆదర్శవంతమైన మహిళగా కొనియాడారు.మహిళల విద్య కోసం ఆమె చాలా కృషి చేసిందని విద్యార్థులకు వివరించారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయిని పేకల వెంకట సరోజినీదేవిని విద్యార్థులు ఉపాధ్యాయులు అందరూ ఘనంగా సత్కరించారు. .కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు పాండ్రంకి గణపతి మాస్టారు, గణపతి సూర్య ప్రకాష్,తవిటి నాయుడు, బాబురావు, రాజులు మాస్టారు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ...

సావిత్రిభాయిపూలే స్ఫూర్తితో విద్యాభివృద్ధికి పోరాడదాం

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయుని సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో జిల్లాలో విధ్యాభి వృద్ధి కోసం పోరాడదామని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అన్నారు. శుక్రవారం సావిత్రిబాయిపూలే 194 వ జయంతి సందర్భంగా సావి త్రి బాయ్ పూలే విగ్రహం వద్ద నిర్వహించిన కార్యమంలో రెడ్డి శంకర రావు మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే భారతదేశ తొలి మహిళాఉపాధ్యాయురాలు, స్త్రీ విద్య కొరకు పాటుపడిన మహనీయురాలు అని అన్నారు. అమె చదువుల తల్లి అని ఆమె స్ఫూర్తితో విజయనగరంలో విద్యాభి వృద్ధికి పోరాడతామని పిలుపు నిచ్చారు. జిల్లా కేంద్రంలో మహిళా కళాశాల ఎత్తేసారు. బిఈడి "లా " కళాశాల ఎత్తేసారని , డిగ్రీ కళాశాల కు బిల్డింగ్ లేదు, దీనివలన ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనారిటీ విద్యార్థులకు చదువుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు . సావిత్రిబాయి పూలే చూపిన మార్గంలో సీపీఎం హక్కులకోసం పోరాటం చేస్తూ ఆమె బాటలో పయనిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి. రమణమ్మ, నగర కమిటీ సభ్యులు బి రమణ , రంభ శ్రీను, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్. ఆనంద్ , డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్, భవన నిర్మాణ కార్మిక సంగం నాయకులు త్రినాధ్ తది తరులు పాల్గొన్నారు.

సావిత్రిభాయిపూలే జీవితంమహిళా లోకానికి స్ఫూర్తి దాయకం : ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయునిసంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని సావిత్రీ భాయి పూలే జీవితం మహిళా లోకానికి ఎంతో స్ఫూర్తి ధాయకమని ఐద్వా జిల్లా కార్యదర్శి పి రమణమ్మ అన్నారు. శుక్రవారం సావిత్రిబాయిపూలే 194 వ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఎల్ బి జి నగర్ లో ఐద్వా ఆధ్వర్యాన నిర్వహించిన కార్యమంలో ఆమె మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే భారతదేశ తొలి మహిళాఉపాధ్యాయురాలు, స్త్రీ విద్య కొరకు పాటుపడిన మహనీయురాలన్నారు. 1854 లో ఆమె జ్యోతిరావు పూలే ఇంట ప్రారంభమైన నిశ్శబ్ద విప్లవం సావిత్రిబాయి అని అంతేగాక సావిత్రిబాయిపూలే శూద్ర, అతిశూద్ర బాల బాలికల విద్యకు ఎంత పాటు పడిందో, అంతకుమించి స్త్రీల సమస్యలపై పని చేసిందన్నారు సర్వ మానవ హక్కులు అనుభవిస్తూ స్త్రీలు ఆత్మగౌరవంతో జీవించటాన్ని గురించి కలకంటూ 1852లో మహిళా సేవా మండల్అనే మహిళా సంఘాన్ని సావిత్రిబాయి స్థాపించారని తెలిపారు కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి జి.పుణ్యవతి నగర నాయకులు రామలక్ష్మి ,కృష్ణమ్మ స్థానిక మహిళలు పాల్గొన్నారు.

మహిళా చైతన్య దీప్తి సావిత్రిబాయి పూలే

విశాలాంధ్ర-గరివిడి: సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాపుసంభంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు నివాళులు అర్పించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాల వేసి , ఆమె మహిళాభివృద్ధి కోసం చేసిన కృషిని కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు డి. రాము మాట్లాడుతూ విద్య ద్వారానే స్త్రీ విముక్తి జరుగుతుందని, బాలికల విద్యాభివృద్ధి కోసం 1848లో పూణేలో బాలికల పాఠశాల ప్రారంభించి, చదువు చెప్పడం ప్రారంభించారు. మహిళా హక్కు లే, మానవ హక్కుల ని నినదించిన ధీరవనిత సావిత్రిబాయి పూలే అని ఆమె సేవలను కొనియాడారు. మహిళలను చైతన్యపరచి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, మహిళలపై జరుగుతున్న అణిచివేతకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలను నిర్వహించారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారని ఆమె చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు జీ.వి. శ్రీదేవి, బి పావని, బి పార్వతి , ఏ నిర్మల కుమారి, ఎం పద్మజ,, కృష్ణవేణి, కె జనార్ధనారావు, కే గోపాలకృష్ణ, సిహెచ్ సింహాచలం, బి అనంతరావు, కొమ్ము మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్ : ధర్మవరం హైస్కూల్ ప్లస్ లో భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలు శ్రీమతి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం బి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొదటగా శ్రీమతి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పాఠశాల హెచ్ఎం మరియు అధ్యాపకులు, ఉపాధ్యాయులు పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల మహిళా ఉపాధ్యాయులు శ్రీమతి బి. జయ, శ్రీమతి సఖీనా బీ, శ్రీమతి సిహెచ్ శోభారాణి, శ్రీమతి వి సరస్వతి, శ్రీమతి డి శ్రావణి, శ్రీమతి సిహెచ్ లావణ్య, శ్రీమతి యన్ సూర్య కుమారి తదితరులకు దుస్సాలువా తో సత్కరించి, ఒక పూలమొక్క మరియు పండ్లు బహుకరించారు . ఈ సందర్భంగా హైస్కూల్ ప్లస్ తెలుగు అధ్యాపకులు రహీం షేక్ లాల్ శ్రీమతి సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి ఉమామహేశ్వరరావు, సిబ్బంది కార్యదర్శి వి ఈ సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఎస్.శివరామకృష్ణ, ఆర్ వి ఎస్ ఎన్ మూర్తి, రహీం షేక్ లాల్, ఐ.నారాయణమూర్తి, వీ.ఈశ్వరరావు, ఎస్ వి ఎస్ ఎన్ మూర్తి(సతీష్ మాస్టర్), హరి, ఎల్ వి సత్యనారాయణ, పొట్నూరు శ్రీరాములు లోకిరెడ్డి కృష్ణ, సిహెచ్ కృష్ణంరాజు, పాపారావు తదితరులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ..

పలు బ్యాంకు మేనేజర్లతో సమావేశం

విశాలాంధ్ర-బాడంగి: ప్రభుత్వ ఆదేశాల మేరకు బాడంగి మండలానికి నిర్దేశించిన 71 బీసీ కార్పొరేషన్ యూనిట్ లకు, ఈ బీసీ కార్పొరేషన్ సంబంధించి 1యూనిట్ లా పై మండల పరిధిలో సర్వీస్ ఏరియా గల బ్యాంకుల మేనేజర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు.. బ్యాంకుల వారీగా యాక్షన్ ప్లాన్ తయారుచేసి జిల్లా కలెక్టర్ విజయనగరం వారి ఆమోదం కొరకు పంపడం జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో బాడంగి స్టేట్ బ్యాంక్ మేనేజర్, బాడంగి ఏపీజీవీబీ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ పినపెంకి ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ వారు ఐఓబి డోనకినవలస వలస బ్రాంచ్ మేనేజర్ పాల్గొనడం జరిగిందని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు.

మన్మోహన్ సింగ్ కు ఘన నివాళులు

కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర విజయనగరం పోర్ట్: మన్మోహన్ సింగ్ మరణం కాంగ్రెస్ పార్టీకే కాదు యావత్ దేశానికి తీరనిలోటని డిసిసి అధ్యక్షులు ఎం. విద్యాసాగర్ (వినయ్) అన్నారు. శుక్రవారం నాడు స్థాని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ కు ఘన నివాళులు అర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మన్మోహన్ సింగ్ చేసిన సేవలు మరువలేని అన్నారు ఆర్థిక సంస్కరణలు తీసుకురావడంలోనూ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అన్నారు. 10 సంవత్సరాల పాటు దేశ ప్రధానిగా ఉంటూ ఒక నీతి నిజాయితీ గల వ్యక్తిగా నిలిచారన్నారు. ఈయన సలహాలు సూచనలు పార్టీ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాయన్నారు. ఈ కార్యక్రమంలో డివైసి ప్రెసిడెంట్ పూడి శ్రీనివాసరావు , ఎస్ కోట నియోజకవర్గం కోఆర్డినేటర్ గేదెల తిరుపతి, నెల్లిమర్ల నియోజకవర్గం కోఆర్డినేటర్ సతీష్, చీపురుపల్లి నియోజకవర్గం కోఆర్డినేటర్ రామ చంద్ర రాజు, జిల్లా ఒ బి సి చైర్మను సురేసు, సనమనేటి శ్రీనివాసరావు విజయనగరం జిల్లా నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తడిచిన వరి పంటని పరిశీలించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామారావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్: శృంగవరపుకోట మండలం సంత గైరవమ్మ పేట గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామారావు క్షేత్రస్థాయిలో పర్యటించి అకాల వర్షాలకు వరి కుప్పలను మరియు అపరాలు పంటలను పరిశీలించారు అపరాల పంటలకు ఇన్సూరెన్స్ నమోదు చేసుకునేందుకు నేడే ఆఖరి రోజున తెలియజేశారు చివరి రోజు అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా రైతు సోదరులను కోరడం జరిగింది. అదేవిధంగా ధాన్యాన్ని అతి త్వరలో నూర్పులు పూర్తిచేసుకుని రైతు సేవా కేంద్రం ద్వారా మిల్లులకు పంపించమని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో కొత్తవలస ఏ డి ఏ ఎల్ విజయం వి ఏ రవి జేబీఎన్ ఎఫ్ సిబ్బంది మరియు రైతు సోదరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలు

మహిళ ఉపాధ్యాయునులకు సత్కారం

విశాలాంధ్ర-వేపాడ: మండల కేంద్రమైన వేపాడ మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ భవనంలో తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.మండల విద్యాశాఖ అధికారులు జి.జగదీశ్వర రావు,పి.బాల భాస్కరరావు,మండల ఉపాధ్యాయ సంఘం బాధ్యులు సారధ్యంలో ఎంపిడిఓ సిహెచ్ సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సావిత్రిబాయి పూలే జన్మదినంను పురస్కరించుకొని పలువురు వక్తలు మాట్లాడుతూ తొలి మహిళ ఉపాధ్యాయురాలుగా ఆమె విద్య అభివృద్ధికి చేసిన కృషి ఎనలేనిదని అలాంటి ఉత్తమమైన మహిళ సేవలను ఆదర్శంగా తీసుకొని మహిళలు మరింత ఉన్నతగా శిఖరాలకు ఎదగాలని కొనియాడారు.ఈ సందర్భంగా మండల మహిళా ఉపాధ్యాయునులు హెచ్.చంద్రకళ కేజీ పూడి. ఎస్.రమాకుమారి, వెల్లాం, జి.మల్లేశ్వరి, చిన గుడిపాల,సిహెచ్ ఎరికమ్మ జగ్గయ్యపేట,ఎన్ లక్ష్మి పాటూరు.పాఠశాలల ఉపాధ్యాయులను దుస్సాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ఎంపీపీ దుర్గ సత్యవంతుడు (సతీష్),జడ్పిటిసి శానాపతి అప్పారావు,వైస్ ఎంపీపీలు అడపా ఈశ్వర రావు, దాయిరి ముత్యాలమ్మ, వేపాడ వల్లంపూడి చిన గుడిపాల సర్పంచులు, మెలిపాక అర్జునమ్మ రుద్ర అంజలి దేవి, భోజంకి రామనాయుడు,ఎంపీటీసీలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా పోలీసు కానిస్టేబులు ఉద్యోగాల నియామక ప్రక్రియ ప్రారంభం : జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: స్టైఫెండరీ మహిళా పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియామకాలకు ప్రాధమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు పి.ఎం.టి., పి.ఈ.టి. పరీక్షల ప్రక్రియ ప్రారంభమైనట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జనవరి 3న నిర్వహించిన 4వ రోజు పి.ఎం.టి., పి.ఈ.టి పరీక్షలకు 550 మంది మహిళా అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 314 మహిళా అభ్యర్థులు మాత్రమే పి.ఎం.టి./పి.ఈ.టి. పరీక్షలకు హాజరయ్యారన్నారు. నియామకాల ప్రక్రియ వేకువ జామున 5గంటల నుండే ప్రారంభం కావడం, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో, పి.ఎం.టి. , పి.ఈ.టి. పరీక్షలు సకాలంలో పూర్తయ్యాయన్నారు. పోలీసు నియామకాల ప్రక్రియను జిల్లా ఎస్పీవకుల్ జిందల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత స్వయంగా పర్యవేక్షించారు.మహిళా అభ్యర్థులకు జనవరి 4, 6వ తేదీల్లో పోలీసు పరేడ్ గ్రౌండులో పి.ఎం.టి. , పి.ఈ.టి. పరీక్షలునిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేపట్టామన్నారు. మహిళా అభ్యర్థులకు పి.ఎం.టి.,పి.ఈ.టి. పరీక్షలను నిర్వహణను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా మహిళా పోలీసు సిబ్బందిని నియమించామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.అభ్యర్థులకు ముందుగా హాల్ టిక్కెట్స్ ను పరిశీలించి, పోలీసు పరేడ్ గ్రౌండులోకి అనుమతించారు. అనంతరం, అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేషన్లు, వయస్సు నిర్ధారించే ధృవ పత్రాలను పరిశీలించి, అన్ని సర్టిఫికేట్స్ సక్రమంగా ఉన్నఅభ్యర్థులకు మాత్రమే బయోమెట్రిక్ తీసుకొని, పి.ఎం.టి. పరీక్షలకు అనుమతించామన్నారు. ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన డిజిటల్ ఇక్విప్మెంట్స్ వినియోగించి, అభ్యర్థుల ఎత్తు, బరువులను నిర్ధారించి, అర్హత సాధించిన మహిళా అభ్యర్థులకు పి.ఈ.టి. పరీక్షలను అనుమతించామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.ఈ నియామక ప్రక్రియలో అదనపు ఎస్పీ పి. సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి. నాగేశ్వరరావు, డిఎస్పీలుయూనివర్స్, ఎం. వీరకుమార్, ఎస్. బాపూజీ, టి.ఎన్.శ్రీనివాసరావు, కే. థామస్ రెడ్డి, ఎఓ పి.శ్రీనివాసరావు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పిఈటీలు మరియు ఇతర పోలీసు అధికారులు, పోలీసు కార్యాలయ ఉద్యోగులు పాల్గొని, ఎంపిక ప్రక్రియ సజావుగా జరిగే విధంగా విధులు నిర్వహించారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా పోలీసుశాఖలో వివిధ హెరీదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యలపరిష్కారానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో "పోలీసు వెల్ఫేర్ డే" నిర్వహించి, సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపిఎస్ మాట్లాడుతూ - పోలీసు సిబ్బంది సమస్యలపరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించుటలో భాగంగా పోలీసు సిబ్బంది ఒక్కొక్కరిని జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబరులోకి పిలిచి, వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన జిల్లా ఎస్పీ, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను జిల్లా ఎస్పీ స్వయంగా పుస్తకంలో నోట్ చేసుకొని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని తెలిపారు.

తాటిపూడి రిజర్వాయర్ లో సాహస జల క్రీడలు ప్రారంభం

పూర్తిస్థాయి భద్రతా ప్రమాణాలతో బోటింగ్ కు ఏర్పాట్లు

పిపిపి విధానంలో పర్యాటక అభివృద్ధి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర-గంట్యాడ : జిల్లా పర్యాటక అభివృద్ధిలో తొలి అడుగు పడిందని రాష్ట్ర సెర్ప్ చిన్న పరిశ్రమలు ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గంట్యాడ మండలం తాటిపూడి రిజర్వాయర్ లో పర్యాటక అభివృద్ధిలో భాగంగా సాహస జల క్రీడలను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వము పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య విధానములో పర్యాటక అభివృద్ధిని ప్రోత్సహించింది అన్నారు దీనిలో భాగంగా ఎన్నారై సంస్థ వాటర్ స్పోర్ట్స్ సింపుల్ ఇండియా ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టును ప్రారంభించా ర ని అన్నారు. అడ్వెంజర్ వాటర్ స్పోర్ట్స్ లో భాగంగా రిజర్వాయర్ లో తొలి దశలో వాటర్ టాక్సీలు స్పీడ్ బోట్లు ఏర్పాటు చేశారని హౌస్ బోట్లు ఫ్లోటింగ్ కాటేజీలు తరువాత ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు సుమారు అయిదు కోట్ల వ్యయంతో ఈ సంస్థ ఎక్కడ బోటింగ్ ఏర్పాటు చేస్తుందన్నారు ఈ ప్రాంతానికి చెందిన యువతకు తగిన శిక్షణ ఇచ్చి బోట్ల ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించడం జరుగుతుందన్నారు రిజర్వాయర్ అవతల ఉన్న దిగువ కొండపర్తి గ్రామ గిరిజనుల కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో బోటు సౌకర్యాన్ని కూడా త్వరలోనే పునరుద్ధరించేందుకు చర్యలు చేపడతామని మంత్రి వెల్లడించారు ప్రాజెక్టుకు గొర్రెపాటి బుచ్చి అప్పారావు పేరుతో పర్యాటక అభివృద్ధికి నాంది పలకడం ఎంతో ఆనందదాయకమని మంత్రి చెప్పారు తాటిపూడి ప్రాజెక్టు ఈ ప్రాంతానికి రావడం స్వర్గీయ గొర్రెపోటి బుచ్చి అప్పారావు కృషి ఎంతో ఉందన్నారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధిని ప్రోత్సహించడంతోపాటు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రాజెక్టును రూపొందించడం ఈ ప్రాంతానికి ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్పర్సన్ పాలవలస యశస్విని మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కళ్ళెంపూడు జగన్నాథం వెంకటరమణ జలవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

అవంతి పాలిటెక్నికల్ కాలేజీలో టెక్ ఉత్సవ్ 2కె 25 పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర -భోగాపురం : మండలంలో కవులువాడ అవంతి పాలిటెక్నికల్ కాలేజీ లో టెక్ ఉత్సవ్ 2కె25 కనెక్టింగ్ విత్ ఫ్యూచర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న ఉన్నత పాఠశాలల నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.ప్రాజెక్ట్ ఎక్సపో,పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్ ,క్విజ్ కాంపిటేషన్ లలో నైపుణ్యాన్ని కనబరిచారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా భీమిలి గవర్నమెంట్ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ మురళీకృష్ణ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించదానికి ప్రాథమిక దశలో ఇటువంటి వైజ్ఞానిక సదస్సులు ఉపయోగపడయని అన్నారు. రాష్ట్రానికి, దేశానికి, భావితరాలకు ఇవి చాల ముఖ్యమని అన్నారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన డైరెక్టర్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ జి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఇటువంటి వైజ్ఞానిక సదస్సులు నిర్వహించడం వలన పిల్లల్లో ఇమిడి ఉన్న సృజనాత్మకతతో దాగివున్న ప్రతిభను వెలికి తీయొచ్చు అన్నారు. మాట్లాడుతూ ఇటువంటి సదస్సుల వల్ల విద్యార్థులలో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం వల్ల పిల్లలు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అధిరోహించడానికి దోహదపడతాయని అవంతి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ మల్లేశం దొర అన్నారు. ఈ యొక్క కార్యక్రమానికి అవంతి రీసెర్చ్ అండ్ టెక్నాలజికల్ అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి గోవింద్,అవంతి కళాశాలల ప్రతినిధి మొత్తం శెట్టి మహేష్, హెచ్ఆర్ డైరెక్టర్ ఏ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ కే భాస్కర రావు పరిపాలన అధికారి జి అశోక్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ కే హేమ వివిధ విభాగాల అధిపతులు విద్యార్థులు పాల్గొని సదస్సును విజయవంతం చేశారు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని కష్టపడి చదవాలి : జేసీ సేతుమాధవన్

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని దానిని సాధించడానికి కష్టపడి చదవాలని సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. ఎన్ని అవరోధాలు ఏర్పడినా లక్ష్యాన్ని మరవకూడదని తెలిపారు. శుక్రవారం కిలతంపాలెం జవహర్ నవోదయా పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా జేసీ పాల్గొన్నారు. ప్రతిరోజు నిర్వహించే అసెంబ్లీ లో జేసీ విద్యార్థుల తో కలసి పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసారు. స్కూల్ ప్రిన్సిపాల్ వాగ్దేవు దుర్గా ప్రసాద్ స్కూల్ అకాడమిక్స్ , అడ్మినిస్ట్రేషన్, ఆర్థిక పరమైన అంశాలను, సాధించిన విజయాలను , 10, 12 తరగతులలో సాధించిన ఫలితాలు తదితర అంశాల పై జేసీ కి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎ. రఘు, ఎం.ఈ.ఓ, డిప్యూటీ డీఈ.ఓ, మెడికల్ ఆఫీసర్, పేరెంట్స్ టీచర్స్ కమిట్టీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-దత్తిరాజేరు: శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి విశాఖ పట్నం వారిచే ఉచిత కంటి మెగా వైద్య శిబిరం జిల్లా అందత్వ నివారణ సంస్థ విజయనగరం వారి సౌజన్యంతో ఈ నెల 6 వ తేదీన ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని వైద్యాధికారి ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కంటి వ్యాధులకు ఉచిత కంటి పరీక్షలు శుక్లం ఆపరేషన్ కు ఎంపికైన నిరుపేదలకు డాక్టర్ సలహా మేరకు కాటరాక్ట్ శస్త్ర చికిత్స (లెన్స్) అమర్చి, కంటిమీద కండ,మెల్లకన్ను సరి చేయుట మరియు కంటి శుక్లాలు ఉన్న పెద్దలకు, పిల్లలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆపరేషన్ లు చేయడం జరుగుతుందని తెలియజేశారు.

నర్సిపల్లిని పరామర్శించిన శంబంగి

విశాలాంధ్ర-తెర్లాం: మండల కేంద్రానికి చెందిన మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు నర్సిపల్లి లక్ష్మణరావు ఇటీవల ఆరోగ్య సమస్యతో బాధపడు తున్నారు.ఈ విషయం తెలుసుకున్న బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శుక్రవారం ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు.తగినంత విశ్రాంతి తీసుకొని తొందరగా కొలుకోవలన్నారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు తెంటు సత్యం నాయుడు,మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు గుల్లిపల్లి మృత్యుంజయ నాయుడు ఉన్నారు.

రెవిన్యూ సదస్సులో సమస్యలు పరిష్కరించుకోవాలి

డిప్యూటీ తహసిల్దార్ సన్యాసినాయుడు

విశాలాంధ్ర-వేపాడ: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో రైతులు సమస్యలు, పరిష్కరించుకోవాలని డిప్యూటీ తాసిల్దార్ కే. సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని రామస్వామి పేట పెద కృష్ణరాజపురం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 18 దరఖాస్తులు అందాయని అన్నారు.రామస్వామి పేట రెవెన్యూ సదస్సులో రైతుల నుండి 9దరఖాస్తులు అందగా పెద కృష్ణరాజపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 9దరఖాస్తులు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు మ్యుటేషన్ కొరకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఆన్లైన్ కొరకుదరఖాస్తులు వచ్చాయన్నారు.వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయడం,జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు శర్మ, ఎం.జగ్గుబాబు,ఆయా గ్రామాల మాజీ సర్పంచులు గోలగాన కృష్ణమూర్తి, మమ్ములూరి రామచంద్రుడు,గ్రామ రైతులు,అటవీ శాఖ అధికారి రాజేశ్వరి,మండల సర్వేయర్ గంగాధర్, సచివాలయం సర్వేయర్ బాలరాజు, వీఆర్వోలు,అప్పారావు,డెక్క ప్రసాదు,శ్రీనివాస్ మిరియాల ఈశ్వరరావు,బి.సన్యాసినాయుడు,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంని కలిసిన మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు



విశాలాంధ్ర-డెంకాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయం నందు మాజీ ఎంపీపీ, నెల్లిమర్ల నియోజకవర్గం టీడీపీ సీనియర్ నేత కంది చంద్రశేఖర రావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పలు అంశాలపై ముఖ్యమంత్రి కి వివరించారు.

కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కుత్తి దీపోత్సవం

విశాలాంధ్ర విజయనగరం ఫోర్ట్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 19వపాశురం సందర్భంగా శుక్రవారం ఉదయం పట్టణంలోని రింగ్ రోడ్ శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం లో భక్తులు కుత్తికా ఒకొక్కరు చొప్పున ఎనిమిదిదీపాలు వెలిగించారు. కుత్తి దీపాలకాంతి గుణములు ప్రకటింప హంసతూలిక నాదమరచి నిద్రించు క్రుష్టా నీళాదేవిని విడిచిపెట్టమని వేడుకున్నారు.శ్రీస్వామివారికి పూల మాలను సమర్పించారు . ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీమన్నారాయణ ఆచార్యులు, రఘునాధాచార్యులు నిర్వహించిన ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీ స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉదయం నగర సంకీర్తనలు నిర్వహించారు.శ్రీశ్రీనివాస సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

నాటు సారాతో వ్యక్తి అరెస్టు : ఎస్సై దేవి



విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని కుమ్మపల్లి గ్రామంలో నాటుసారాతో పట్టుబడిన వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేయడం జరిగిందని వల్లంపూడి ఎస్సై బొడ్డు దేవి తెలిపారు.కుమ్మపల్లి గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం గ్రామంలో దాడి చేయగా సారా అమ్ముతున్న వ్యక్తిని పట్టుకోగా వారి నుండి ఏడు లీటర్ల నాటుసారా బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.ఈ దాడిలో పోలీస్ సిబ్బంది కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేని స్మరించుకుందాం

చోడి ఆదినారాయణ, కిల్లంపల్లి ఆచారి



విశాలాంధ్ర -విజయనగరం ఫోర్ట్: మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి పూలే గుర్తింపు పొందారని ప్రజా హక్కుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ చోడి ఆదినారాయణ, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు కిల్లంపల్లి ఆచారి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే స్ఫూర్తితో ఆమె చేసిన ప్రయత్నం వల్ల మహిళలు విద్యావంతులై అభివృద్ధి చెందారని భవిష్యత్తులో కూడా చదువు ద్వారానే సమాజం అభివృద్ధిని చెందుతుందని అన్నారు. సావిత్రిబాయి పూలే 194వ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టర్ ఆఫీస్ దగ్గర్లో ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం సహాయ కార్యదర్శి నాని ,బీసీ యాత కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ గొంప అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కొండ్రు మురళి రాజాం పర్యటన

విశాలాంధ్ర-రాజాం : మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ శనివారం ఉదయం09:30నిమిషాలకు సీతారామ సినిమా దియేటర్ ఎదురుగా విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో నూతనంగా ఆరోగ్య శ్రీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.ఉదయం 10:00 గంటలకు ఆర్టీసీ బస్సు స్టాండ్ ఆవరణంలో నూతన ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తారు.ఉదయం10:30 గంటలనిమిషాలకు ప్రభుత్వ ఆసుపత్రిలో హాస్పటల్ డెవలప్మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొంటారు.ఉదయం 11:30నిమిషాలకు శ్రీనివాస థియేటర్ ఎదురుగా గవర్నమెంట్ జూనియర్ (బోయ్స్)కళాశాల నందు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తారు...

మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి

లొట్లపల్లి గ్రామసభలో తీర్మాణం

విశాలాంధ్ర-జామి: మండలంలోని లొట్లపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జన్నెల సింహాచలం అధ్యక్షతన జరిగిన ఈసభలో గ్రామాభివృద్ధికి సంభందించిన పలు తీర్మాణాలను పంచాయతీ కార్యదర్శి ఆర్.శజవకుమారి వివరించగా పాలకవర్గ సభ్యులతోపాటు గ్రామ పెద్దలు అంతా తీర్మాణాలను ఆమోదించారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. అనంతరం పలు ప్రాంతాలలో మొక్కలను నాటారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి జన్నెల సూరిదేముడు, మాజీ ఎంపిటిసి శిడగ నూకరాజు, శిడగ గోపి తదితరులు పాల్గొన్నారు.

తాటిపూడి జలాశయానికి గొర్రిపాటి పేరును పునరుద్ధరణపై పుణ్యగిరి వెలమ సంక్షేమ సంఘం హర్షం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: తాటిపూడి జలాశయానికి గొర్రిపాటి బుచ్చి అప్పారావు రిజర్వాయర్ గా పేరును పునరుద్ధరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందుకుగాను పుణ్యగిరి వెలమ సంక్షేమ సంఘం నాయకులు సమాసం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా రిజర్వాయర్కు గొర్రిపాటి అప్పారావు పేరును పునరుద్ధరించినందుకుగాను దీనికి సహకరించిన శృంగవరపుకోట శాసనసభ్యులు కోళ్ల లలిత కుమారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు అదేవిధంగా రాష్ట్ర మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్ కు మరియు రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి వి జి కుమార్ కు, పుణ్యగిరి వెలమ సంక్షేమ సంఘం ఎస్ కోట వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుణ్యగిరి వెలమ సంక్షేమ సంఘం గౌరవ సలహాదారు జి ఎస్ నాయుడు మాట్లాడుతూ గొర్రిపాటి బుచ్చి అప్పారావు సమాజానికి ఎంతగానో సేవలు అందించారాని అతను స్వతంత్ర ఉద్యమ యోధుడని. తాటిపూడి జలాశయ నిర్మాణంలో తనదైన కృషిని చేసి రిజర్వాయర్ నిర్మాణానికై పోరాటం చేశారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పుణ్యగిరి వెలమ సంక్షేమ సంఘం ఎస్ కోట గౌరవ సలహాదారులు జిఎస్ నాయుడు, బంగారు నాయుడు, జి సత్యం , అధ్యక్షులు కె కోటేశ్వరరావు ,కార్యదర్శి చెప్ప శ్రీనివాసరావు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కుంకుమ పూజలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ధనుర్మాసంలో శుక్రవారం కుంకుమ పూజలు చేస్తుంటామని జ్ఞానజ్యోతి ఆధ్యాత్మిక మండలి వ్యవస్థాపకురాలు పి.కుమారి తెలిపారు. శుక్రవారం శ్రీ పంచముఖ అంజనేయ స్వామి దేవాలయం వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ లోకకళ్యాణర్థం సువాసినిలుచే అనేక ఆధ్యాత్మిక కార్యక్రమంలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కార్యదర్శి కామరాజు పాల్గొన్నారు..

బస్సు ప్రమాదంపై చర్యలు తీసుకున్న జోన్ చైర్మన్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : విజయనగరం జిల్లాలో మెంటాడ మండలం గుర్మమ్మవలస గ్రామ సమీపంలో శుక్రవారం ఆర్టీసీ బస్సు బోల్తా పడ్డ ప్రమాదంపై విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు ఆయన డిపిటీవో అప్పలనారాయణ,ఈడి విజయ్ కుమార్ తో ఫోన్లో మాట్లాడి ప్రమాదం జరగడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డ ప్రయాణికులకు అత్యవసరంగా చికిత్స అందించాలని ఆయన ఆదేశించారు. మిగతా ప్రయాణికులకు ఎవరికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరేలా ఏర్పాట్లు చేయాలని చైర్మన్ దొర ఆదేశించారు.

పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

విశాలాంధ్ర-శృంగవరపుకోట.: మండలంలోని సంత గౌరమ్మపేట గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన వరికుప్పలను మరియు అపరాల పంటలను జిల్లా వ్యవసాయ అధికారి వి. టి. రామారావు శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అపరాల పంటలకు ఇన్సూరెన్స్ చేసుకునేందుకు శుక్రవారం ఆఖరి రోజు అని తెలిపారు. అదేవిధంగా రైతులు వరికుప్పలను నూర్పు చేసి రైతుసేవ కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించాలని కోరారు ఈ కార్యక్రమంలో కొత్తవలస ఏ డి ఏ, ఎల్. విజయ, వి ఏ ఏ రవి, జెడ్ బి ఎస్ ఎఫ్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాటిపూడి ' కి గొర్రిపాటి పేరు పునరుద్ధరణ హర్షణీయం

- ఇది టీడీపీ చిత్తశుద్ధికి నిదర్శనం

- కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పల నాయుడు

విశాలాంధ్ర-బాడంగి : తాటిపూడి రిజర్వాయర్ కు స్వాతంత్ర సమరయోధుడు, సామాజిక ఉద్యమకారుడు స్వర్గీయ గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును పునరుద్ధరించడంపై కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా సాగునీటి అవసరాలతో పాటు మహావిశాఖ నగరపాలక సంస్థ తాగునీటి అవసరాల కోసం గోస్తనీ నదిపై గంట్యాడ మండలంలో తాటిపూడి వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి విశేష కృషి చేసిన బుచ్చి అప్పారావు పేరు పునరుద్దించడం ముదవాహం అన్నారు. ఇందుకు కృషి చేసిన వెలమ సంఘ పెద్దలు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీల పక్షపాతి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రులు నిమ్మల రామానాయుడు, కొండపల్లి శ్రీనివాస్, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి వి జి కుమార్, కూటమి ప్రభుత్వ పెద్దలకు కొప్పుల వెలమ కుటుంబ సభ్యులందరి తరపున ధన్యవాదాలు తెలియజేశారు. తొలి నుంచి బీసీలకు అండగా నిలవడంతో పాటు బీసీ నేతలకు పార్టీలోనూ ప్రభుత్వంలోనూ సముచిత స్థానం కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకి దక్కుతుందన్నారు.

ఘనంగా...సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

విశాలాంధ్ర- శృంగవరపుకోట : ధర్మవరం హైస్కూల్ ప్లస్ లో భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం బి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొదటగా శ్రీమతి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పాఠశాల హెచ్ఎం మరియు అధ్యాపకులు, ఉపాధ్యాయులు పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల మహిళా ఉపాధ్యాయులు శ్రీమతి బి. జయ, శ్రీమతి సకీనా బీ, శ్రీమతి సిహెచ్ శోభారాణి, శ్రీమతి వి సరస్వతి, శ్రీమతి డి శ్రావణి, శ్రీమతి సిహెచ్ లావణ్య, శ్రీమతి యన్ సూర్య కుమారి తదితరులకు దుస్సాలువా తో సత్కరించి, ఒక పూలమొక్క మరియు పండ్లు బహుకరించారు . ఈ సందర్భంగా హైస్కూల్ ప్లస్ తెలుగు అధ్యాపకులు రహీం షేక్ లాల్ సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బి ఉమామహేశ్వరరావు, సిబ్బంది కార్యదర్శి వి ఈ సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఎస్.శివరామకృష్ణ, ఆర్ వి ఎస్ ఎన్ మూర్తి, రహీం షేక్ లాల్, ఐ.నారాయణమూర్తి, వీ.ఈశ్వరరావు, ఎస్ వి ఎస్ ఎన్ మూర్తి(సతీష్ మాస్టర్), హరి, ఎల్ వి సత్యనారాయణ, పొట్నూరు శ్రీరాములు లోకిరెడ్డి కృష్ణ, సిహెచ్ కృష్ణంరాజు, పాపారావు తదితరులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

భూస్వామి చేతుల్లో డి. పట్టా భూమి

రొంపిల్లివలస గిరిజనులను మోసం చేస్తున్న రెవిన్యూ అధికారులు

విశాలాంధ్ర-రామభద్రపురం: పెత్తందారి చేతుల్లో డి పట్టా భూములు ఉన్నాయని స్థానిక సిపిఎం నాయకులు బలస శ్రీను అన్నారు. రొంపిలవలస గ్రామంలో శుక్రవారం ఆయన మాట్లాడారు . రామభద్రపురం మండలం రొంపిల్లి వలస రెవెన్యూ పరిధిలో తెర్లపు అకమ్మ సర్వేనెంబర్ 22-1 భూమి 2 ఎకరాలు నా పేరున పట్టా ఇచ్చారని చెప్తే ఈ పట్టా చెల్లదు అని చెప్పి ఆ రెండెకరాల్లో జీడి తోట ఫలసయాన్ని భూస్వామికి అప్పజెప్పారు. అదే రెవెన్యూ పరిధిలో సర్వే నెం. 74-4 తెల్లాపు కురమన్న దొర పేరును 45 సెంట్లు భూమి ఉంది.ఇది సంవత్సరం లీజుకు మాత్రమే ఇచ్చామని సర్వేర్ చెప్పారట రామభద్రపురంలో రెవెన్యూ అధికారులు భూస్వాములకు అమ్ముడుపోయినట్లు కనబడుతుందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. శంకర్రావు మండల నాయకులు బలస శ్రీను అన్నారు. రెవెన్యూ పరిధిలో 100 ఎకరాలకు పైగా భూమి ఉన్న ఒక భూస్వామి 40 ఎకరాలకు పైగా డి పట్టా ఆక్రమించుకొని దర్జాగా అనుభవిస్తున్నాడు ఇదే గ్రామంలో సుమారు 50 కుటుంబాలు సెంటుబీ భూమి లేక గ్రామంలో కూలి పనులు దొరక్క తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు ఇవేవీ అధికారులకు, పాలకులకు కనిపించడం లేదు. మొత్తం ఈ రెవెన్యూ పరిధిలో డి పట్టా భూమి ఎంత ఉందో అంతా పేదలైన గిరిజనులకు పంచాలని డిమాండ్ చేస్తున్నాం.అలాగే గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్ కు గిరిజనుల భూమిని తీసుకున్నారు. రికార్డులు తారుమారు చేసి అర్హులకు నష్టపరిహారం చెల్లించకుండా అనార్హులు పేరు పెట్టి లక్షలాది రూపాయలు రెవెన్యూ అధికారులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. వీటన్నిటి పైన జిల్లా అధికారులు సమగ్రమైన దర్యాప్తు జరిపి అవినీతికి పాల్పడిన రెవెన్యూ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎట్టకేలకు మారికి రోడ్డు పనులు ప్రారంభం

ఆందోళన విరమించిన మారిక గిరిజనులు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని కరకవలస శివారు గిరిశిఖర గ్రామం మారికకు రోడ్డు వేయాలని కోరుతూ మారిక గిరిజనలు మండల పరిషత్ కార్యాలయం ముట్టడితో చేపట్టిన ఆందోళనకు అధికారులు స్పందించి ఎట్టకేలకు శుక్రవారం రోడ్డు పనులు చేపట్టారు.గిరిజనుల డిమాండ్ మేరకు గుత్తేదారుతో రహదారి నిర్మాణం పనులు ప్రారంభించడంతో గిరిజనలు ఆందోళన విరమించారు. సిపిఎం నాయకుడు చల్లా జగన్ సారధ్యంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వంట వార్పుతో నిరసన చేపట్టడంపై స్పందించిన ఇంజనీరింగ్ అధికారులు,శృంగవరపుకోట రూరల్ సీఐ ఎల్. అప్పలనాయుడు, వల్లంపూడి ఎస్సై దేవి,ఎంపీడీవో సిహెచ్ సూర్యనారాయణ వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడులు, గిరిజనులతో మాట్లాడగా రహదారి పనులు ప్రారంభించే వరకు నిరసన కార్యక్రమాన్ని విరమించేది లేదని కరాకండిగా చెప్పడంతో గత్యంతరం లేని పక్షంలో గిరిజనులు గిరిజన సంఘం నాయకులు,డిమాండ్ మేరకు,అధికారులు మారిక రహదారిని పరిశీలించడంతోపాటు ఉత్తేదారులతో మాట్లాడి తక్షణమే పనులు ప్రారంభించారు.అధికారుల మాటలకు చర్యలకు సంతృప్తి చెందిన గిరిజనులు ఆందోళన విరమించి ఇంటి ముఖం పట్టారు.అలాగే గిరిజనుల ఆందోళనలో ఏవిధమైన సంఘటనలు చోటు చేసుకోకుండా వల్లంపూడి ఎస్సై బీ.దేవి బందోబస్తు ఏర్పాటు చేశారు. అటవీశాఖ అధికారులతో పాటు పిఆర్ ప్రాజెక్ట్ ప్రత్యేక విభాగం డి.ఈ.ఈ జిఎస్ఎన్ మూర్తి, ఏఈఈ ఐశ్వర్యులు సంయుక్తంగా మారిక రహదారిని పరిశీలించారు.అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద గిరిజనులు చేపట్టే ఆందోళన శిబిరం వద్దకు చేరుకొని ఎస్ కోట రూరల్ సిఐ ఎల్ అప్పలనాయుడు వల్లంపూడి ఎస్.ఐ బి.దేవి మండల పరిషత్ అభివృద్ధి అధికారి సూర్యనారాయణతో కార్యాలయంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడుల సమక్షంలో మంతనాలు జరిపి రహదారి నిర్మాణం పనులు ప్రారంభించేందుకు గుత్తేదారును అంగీకరింప చేశారు.అనంతరం గిరిజనల వద్దకు చేరుకొని రహదారి పనులు ప్రారంభించడం జరుగుతుందని ప్రకటించారు.ఇందుకు సంబంధించి యంత్రాలు రహదారి వద్దకు సంబంధిత వ్యక్తులతో మాట్లాడి పనులు ప్రారంభం చేయించారు. విషయం గిరిజనులకు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేసిన గిరిజనలు ఆందోళన విరమించినట్లు ప్రకటించారు.

ఘనంగా జైపాల్ సింగ్ ముండ జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: పుణ్యగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఘనంగా జైపాల్ సింగ్ ముండ జయంతి ఉత్సవాలను చరిత్ర శాఖ, ఎన్.ఎస్.ఎస్. సంయుక్తంగా నిర్వహించారు. ముందుగా జైపాల్ సింగ్ ముండా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు మాట్లాడుతూ, జైపాల్ ముండ పశ్చిమబెంగాల్ రాంచి జిల్లా జనవరి 3 193 వ సంవత్సరం ముండ గిరిజన తెగకు చెందిన కుటుంబంలో జన్మించాడు. చిన్నతనములో గొర్రెల మందను కాసుకొని క్రిస్టియన్ మిషనరీ స్కూల్లో చదువుకునేవాడు అతని చురుకైన వ్యక్తి కావడం నాయకత్వ లక్షణం కనపరచడం వల్ల మిషనరీ స్కూల్ వారు పై చదువులకు లండన్ క్రేమ్ బ్రిడ్జ యూనివర్సిటీ కి పంపించారని, 1928లో ఒలింపిక్స్ గేమ్ లో భారత్ తరఫున హాకీ జట్టుకు నాయకత్వ వహించి ఒలింపిక్ లో భారతదేశం విజయకేతనానికి కారణం జైపాల్ సింగ్ ముండా అని తెలియజేశారు. జైపాల్ సింగ్ ముండ జీవిత చరిత్రను, ఆదివాసులకు అతను చేసిన సంస్కరణలను, పశ్చిమ బెంగాల్ నుండి జార?ండ్ స్టేట్ ఏర్పడడానికి ఆయన చేసిన ప్రయత్నాలను , భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ సభ్యుడిగా ఎస్టీలకు ప్రత్యేకమైనటువంటి రాజ్యాంగ సవరణ అతని కృషి గణనీయమైందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె వాసుదేవరావు ఎన్ఎస్ఎస్ పిఓ డాక్టర్ జి ఈరన్న, చల్లా శ్రీనివాసరావు, కెమిస్ట్రీ భాస్కర్, హైమావతి, లక్ష్మణ్ ,రామకృష్ణ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.